క్లుప్తంగా

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

మైదుకూరు : బద్వేలులో విద్యార్థినిపై పెట్రోలు పోసి హత్యకు పాల్పడిన విఘ్నేష్ అనే యువకుడిని కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా స్టూడెంట్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు జగదీష్, కార్యదర్శి నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న ఖాదర్‌బాషా

పోరుమామిళ్ల: ప్రభుత్వం మధ్యంతర భృతి 30 శాతం ప్రకటించాలని, సీపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఖాదర్‌బాషా కోరారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో జరిగిన ఆ సంస్థ రీజియన్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన ఏపీజీఎల్ఐసీ, పీఎఫ్, ఎస్ఎల్ బకాయిలు, మధ్యాహ్న భోజన బకాయిలు వెంటనే ఇవ్వాలన్నారు. ప్రాథమిక పాఠశాలల బలోపేతానికి 117 జీఓ రద్దు మంచిదే అన్నారు. ప్రభుత్వం సంస్కరణల పేరుతో ప్రాథమిక విద్యను నిర్లక్ష్యం చేయడం తగదన్నారు. సమావేశంలో స్టేట్ కౌన్సిలర్ భాస్కర్‌రెడ్డి, గురయ్య, మండల నాయకులు సత్తార్, గురయ్య, భూపాల్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, సుబ్బయ్య, రమణారెడ్డి పాల్గొన్నారు.

ముగిసిన పల్లె పండుగ వారోత్సవాలు

గోపవరం: ఈ నెల 14వ తేదీ నుండి నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాలు ఆదివారంతో ముగిశాయని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. చివరి రోజు కాలువపల్లెలో రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ నిర్వహించినట్లు ఆయన తెలిపారు. మండల వ్యాప్తంగా నిర్వహించిన పల్లె పండుగ వారోత్సవాల్లో 22 పనులకు గాను రూ.1.26 కోట్లు ఖర్చు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో అన్ని గ్రామ పంచాయతీల పరిధిలో మంజూరైన పనులకు భూమిపూజ చేయడం జరిగిందన్నారు. త్వరలోనే మంజూరైన పనులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, ఏపీఓ విజయమ్మ, పంచాయతీ కార్యదర్శులు విజయకుమార్, శ్రీనివాసులరెడ్డి, పీఆర్ ఏఈ శ్రీనివాసులు, అన్నిశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయోగాల ద్వారా విద్యార్థులకు సైన్స్ బోధించాలి



ప్రయోగాలు చేసి వివరిస్తున్న రీసోర్స్ పర్సన్లు

ప్రొద్దుటూరు కల్చరల్: విద్యార్థులకు ప్రయోగాల ద్వారా సైన్స్ అంశాలను బోధిస్తే సులభంగా వారికి అర్థమవుతాయని రీసోర్స్ పర్సన్లు తెలిపారు. స్థానిక శ్రీవెంకటేశ్వర డిగ్రీ కాలేజీలో ఆదివారం సర్ సీవీ రామన్ సైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో భౌతిక, రసాయన, జీవ శాస్త్ర వర్క్‌షాప్ నిర్వహించారు. ఫిజిక్స్‌లో కాంతి పరావర్తనం, వక్రీభవనంకు సంబంధించిన ప్రయోగాలను చేసి చూపించారు. బయాలజీకి సంబంధించి ఏకదళ బీజ, ద్విదళ బీజ, కాండం, వేరు, ఆకు అడ్డుకోతలు, కోడి ద్వారా టెండాన్, లిగ్మెట్, మెదడు, దృక్‌నాడీ, జీర్ణవ్యవస్థ గురించి ఉపాధ్యాయులకు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో 40 మంది ఫిజిక్స్, బయాలజీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్లు, క్లబ్ కార్యదర్శి అల్లాబకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు బాల ఓబయ్య సేవలు ఆదర్శం

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల ప్రాంతంలో 35 సంవత్సరాలు ఎస్జీటీగా, స్కూలు అసిస్టెంట్‌గా బాలఓబయ్య విశేష సేవలందించారని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన బాల ఓబయ్యకు ఆదివారం స్థానిక వసుంధర కళ్యాణ మండపంలో ఎస్టీయు ఆధ్వర్యంలో సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఇలాయాస్‌బాషా, ఎస్టీయూ జిల్లా, మండల నాయకులు, నాలుగు మండలాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కడప కార్పొరేషన్ : ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్టు ఆఫీసర్స్ అసోసియేషన్ కడప డివిజన్ యూనిట్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. కడప డివిజన్ ప్రెసిడెంట్‌గా శ్రీపతి ఓబులేశు, వైస్ ప్రెసిడెంట్‌గా రాజశేఖర్‌రాజు, సెక్రటరీ శ్రీనివాసులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ భరణికుమార్, జాయింట్ సెక్రటరీ భాను, ట్రెజరర్‌గా విశ్వనాథ్‌లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అటవీశాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

రైతులకు శాపంగా మారిన గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే

- భూములు ఇచ్చేందుకు రైతుల నిరాకరణ
- మార్కెట్ ధర రూ. కోటి.. రైతులకు అందే పరిహారం రూ.1 5లక్షలే
- పనులు ప్రారంభమైనా రైతులకు అందని పరిహారం



సోమాపురం పంచాయతీలో గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణ పనులు




అల్లాడుపల్లె లో గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు కోసం సేకరించిన భూములు

చాపాడు: బెంగుళూరు – కడప – విజయవాడ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే రైతుల పాలిట శాపంగా మారింది. ఏడు నెలల క్రితమే నిర్మాణ పనులు ప్రారంభం కాగా గత రెండు మూడు నెలల క్రితం కొత్త రాజకీయ రంగు కారణంగా పలు చోట్ల పనులకు ఆటంకం ఏర్పడింది. చాపాడు మండలంలో ఇప్పటికే పలు గ్రామాల వద్ద రోడ్డు నిర్మాణ పనులు మొదలుపెట్టారు. అయితే వాహనదారులు, ప్రయాణికులు ఈ రోడ్డు ఉపయోగకరం అయినప్పటికీ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోయే రైతులకు మాత్రం ఈ రోడ్డు శాపంగా మారింది. గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణంతో పాటు ఈ రోడ్డును కర్నూలు – కడప జాతీయ రహదారికి అనుసంధానం చేసేందుకు ప్రభుత్వం మండలంలో 93 ఎకరాలు సేకరించేందుకు చర్యలు చేపట్టింది. అయితే అనుసంధాన రోడ్డు గ్రీన్ ఫీల్డ్ సర్కిల్ రైతులకు ఇబ్బంది కలిగిస్తోంది. ఈ సర్కిల్ కోసం రైతులకు చెందిన ఎకరా నుంచి 8 ఎకరాల వరకూ భూములు కోల్పోతోంది. బహిరంగ మార్కెట్‌లో ఎకరా రూ. కోటికి పైగా పలుకుతుండగా ప్రభుత్వం మాత్రం రూ.15 లక్షల వరకూ ఎకరాకు ఇస్తుండటంతో రైతులు ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికే గ్రీన్‌ఫీల్డ్ హైవే కోసం సేకరించిన భూములకు ఎకరాలకు రూ.15 లక్షల చొప్పున బాధిత రైతుల ఖాతాల్లో నగదు జమ అవుతోంది. నగదు జమ కాని రైతులతో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, రెవెన్యూ అధికారులు గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహిస్తూ బాధిత రైతుల వివరాలు సేకరిస్తున్నారు.

చాపాడు మండలంలో 350 ఎకరాలు భూ సేకరణ

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో బెంగుళూరు నుంచి విజయవాడకు 337 కి.మీ గ్రీన్ ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే ఏర్పాటుకు ఇప్పటికే ప్రభుత్వం భూ సేకరణ చేపట్టింది. ఏపీ, కర్నాటక సరిహద్దులోని అనంతపురం జిల్లా కోడికొండ చెక్ పోస్ట్ వద్ద హైదరాబాదు – బెంగుళూరు 44వ జాతీయ రహదారి నుంచి చైన్నై – కలకత్తా హైవే పైకి నూతనంగా నాలుగు లైన్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణం చేపట్టేందుకు నేషనల్ అథారిటీ ఆఫ్ ఇండియా చర్యలు తీసుకుంది. ఈ క్రమంలో ఈ రోడ్డు నిర్మాణం కోసం వైఎస్సార్ జిల్లాలో 125 కి.మీ రోడ్డు నిర్మించేందుకు 1300 హెక్టార్ల భూమి అవసరం కానుంది. చాపాడు మండల పరిధిలో 350 ఎకరాల భూ సేకరణ చేపట్టారు. అనంతపురం, భూడిదపాడు, కుచ్చుపాప, అల్లాడుపల్లె, సోమాపురం, పిచ్చపాడు రెవెన్యూ గ్రామాల పరిధిలోని 350 ఎకరాలను వినియోగించనున్నారు. దీని కోసం ఇప్పటికే భూ సేకరణ, కొలతలు, రైతుల వివరాల సేకరణ పనులు పూర్తయ్యాయి. నష్ట పరిహారం 70 మంది రైతులకు అందినప్పటికీ 30 శాతం మంది రైతులకు పరిహారం అందలేదు. ఇదే క్రమంలో భూములకు మాత్రమే పరిహారం అందించారని, భూముల్లో ఉండే విలువైన బోర్లు, పైపులైన్లు, పలు రకాలైన చెట్లకు పరిహారం అందించాల్సి ఉంది. వీటిపైన స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ల ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారుల గ్రామాల్లో రైతుల సమస్యలపై గ్రామ సభలు పెట్టినప్పటికీ పరిహారం ఇప్పటికీ అందలేదని రైతులు వాపోతున్నారు.


బోర్లు, చెట్లకు పరిహారం అందలేదు



సర్వే నంబర్లు 92/4లో నా భార్య సావిత్రమ్మ పేరుతో 3.60 ఎకరాలు ఉంది, సర్వే నెం .92/1లో నా పేరుతో 90 సెంట్లు ఉండగా 27 సెంట్లు రోడ్డు విస్తరణలో పోయింది. అయితే భూములకు రూ.1 5లక్షల చొప్పున డబ్బులు వచ్చాయి. కానీ ఈ భూముల్లో ఉండే 674, 676 సర్వీసుల బోర్లు, అల్ల నేరేడు, అంజూరు, నిమ్మ, రామ ఫలం వంటి చెట్లకు పరిహారం అందలేదు, రెండు బోర్ల విలువ రూ.2 లక్షలకు పైగా ఉంటుంది. అధికారులేమో పరిహారం వస్తుందని చెబుతున్నారు. కానీ ఇప్పటివరకు పరిహారం రాలేదు.

గోసుల వీరారెడ్డి, బాధిత రైతు, అల్లాడుపల్లె, చాపాడు మండలం

10 సెంట్లకే పరిహారం వచ్చింది



రోడ్డు విస్తరణకు అల్లాడుపల్లె పొలంలోని 50 సెంట్ల తీసుకున్నారు. పనులు కూడా జరుగుతున్నాయి. కానీ నాకు 10 సెంట్లకు మాత్రమే పరిహారం అందింది. ఇప్పటి వరకూ రెండు మూడు సార్లు అధికారులు సభలు పెట్టారు. ప్రతి సభలో అర్జీలు ఇస్తున్నా పరిహారం అందలేదు. ఆన్‌లైన్‌లో భూమి లేకపోవటం వలన పరిహారం రాలేదని, పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామని అధికారులు చెబుతున్నారు.

హుస్సేన్, బాధిత రైతు, శ్రీరాములపేట, చాపాడు మండలం

ప్రొఫెసర్ సాయిబాబా మరణం ప్రభుత్వ హత్య



ప్రొద్దుటూరు శివాలయం సర్కిల్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు క్రైం: ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా మరణం ప్రభుత్వ హత్య అని ప్రజా సంఘాల నాయకులు తెలిపారు. ఆదివారం స్థానిక శివాలయం సర్కిల్ వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. అనంతరం జేవీవీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ 90 శాతం వికలాంగుడైన సాయిబాబా ప్రజల కోసం ఎన్నో పోరాటాలు నిర్వహించి పదేళ్ల జైలులో గడపాల్సి వచ్చిందన్నారు. తీవ్ర నిర్బంధాన్ని కూడా ఆయన లెక్క చేయకుండా ఆదర్శంతమైన జీవితాన్ని గడిపి మరణాన్ని దిక్కరిస్తూ ప్రజల నాలుకల్లో జీవించాడన్నారు. పదేళ్ల తర్వాత ప్రభుత్వం ఆయనను నిర్దోషి అని విడుదల చేసిందన్నారు. సాయిబాబా కుటుంబం కూడా తీవ్ర ఇబ్బందులకు గురయ్యారని తెలిపారు. జైలులో వికలాంగుడైన సాయిబాబాకు కనీసం మానవత్వం లేకుండా మందులు ఇవ్వకుండా చాలా ఇబ్బందులకు గురిచేశారన్నారు. కన్న తల్లి చనిపోయిన కూడా చివరి చూపుకు అవకాశం ఇవ్వలేదన్నారు. ఆయనకు జైలులో సరైన ఆహారం , మందులు లేకపోవడంతో అనారోగ్యానికి గురయ్యారన్నారు. మహిళలు, దళితులు, ముస్లింలు, ఆదివాసీల కోసం ఆయన పోరాటాలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో పౌరహక్కుల సంఘం ప్రతినిధి సురేష్‌బాబు, జేవీవీ నాయకుడు హేమంత్, విరసనం నాయకురాలు వరలక్ష్మి, సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ, సీపీఐ ఏరియా కార్యదర్శి సుబ్బరాయుడు, మాలమహానాడు నాయకుడు మురళి, ప్రగతిశీల కార్మిక సమాఖ్య ప్రతినిధి శ్రీనివాసులు, ప్రజా నాట్యమండలి నాయకుడు రమణ, నాస్తిక సమాజం ప్రతినిధి సాయికుమార రచయిత్రి రామాయణం రాజేశ్వరి, సమతా మహిళా విభాగం నాయకురాలు ఉషా, ఇన్నర్‌వీల్ క్లబ్ నాయకురాలు భారతి, చైతన్య మహిళా సంఘం నాయకురాలు పద్మ, జమా అతె ఇస్లామి హింద్ నాయకుడు షఫీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

సమాజ నిర్మాణంలో కవుల పాత్ర కీలకమైనది



పుస్తకావిష్కరణ చేస్తున్న ముఖ్య అతిథులు

ప్రొద్దుటూరు కల్చరల్: సమాజ నిర్మాణంలో కవుల పాత్ర కీలకమైనదని పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెంగల వీరాంజనేయులు తెలిపారు. స్థానిక శ్రీకృష్ణగీతాశ్రమంలో ఆదివారం పెరుగు భవాని శంకర్ రచించిన 'విపంచిక'అనే ఖండ కావ్యాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజు దేశాన్ని పాలిస్తే కవులు మనసుల్ని పాలిస్తారన్నారు. రచయిత దేశభక్తితో ఈ కావ్యాన్ని రచించారని, ప్రాశ్చాత్య వ్యామోహంలో దేశ యువత చిక్కుకుని నిర్వీర్యమౌతోందన్నారు. తన రచనల ద్వారా నిద్రాణమైన యువతను మేల్కొలిపి భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు, విలువల గొప్పదనాన్ని వివరించారన్నారు. కవి డాక్టర్ బుర్రి సుబ్బరాయుడు మాట్లాడుతూ భవాని శంకర్ రెండు కావ్యాలను రచించి భారతమాతకే అంకితం చేశారని, భారతీయులను జాగృతం చేసే రచనలు చేశారని కొనియాడారు. కాల్వ చలపతి పుస్తక సమీక్ష చేస్తూ విపంచిక పుస్తకం భారతీయ ఆత్మను సాక్షాత్కరించిందన్నారు. పుస్తక పఠనం జ్ఞాన శిఖరాలను చేరుస్తుందన్నారు. రచయిత భవాని శంకర్ మాట్లాడుతూ భారతీయత ఒక అద్భుతమన సైన్స్ అని, దీనిని విడవడమంటే వజ్రాలను వదలి గాజుముక్కలను ఏరుకోవడమే అన్నారు. ప్రజలు జాతీయ వాదభావాలతో దేశాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో విభాగ్ ప్రముఖ్ మారెళ్ల మల్లిఖార్జునరావు, సాహితీ అభిమానులు పాల్గొన్నారు.

గ్రంథాలయం తనిఖీ



గ్రంథాలయాన్ని తనిఖీ చేస్తున్న కార్యదర్శి సయ్యద్ అమిరుద్దీన్

చాపాడు: చాపాడు శాఖా గ్రంథాలయాన్ని ఆదివారం గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సయ్యద్ అమిరుద్దీన్ తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను, దిన, వార, మాస పత్రికలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి ప్రత్యేక చొరవ తీసుకోవాలని, పాఠకుల సంఖ్య రోజురోజుకు పెరిగే చర్యలు తీసుకోవాలన్నారు.

ఇదే క్రమంలో పాఠకు సభ్యత్వాలు పెంచాలని నిరుద్యోగులు, విద్యార్థులకు ఉపయోగకరంగా ఉండేలా పత్రికలు, కరెంట్ అఫైర్స్ వంటి వాటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రజలను గ్రంథాయాలన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి జె.శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుదాం



మున్సిపల్ కమిషనర్ మల్లికార్జుననను సత్కరిస్తున్న సద్భావన సేవా సమితి, మన ప్రజా సేవా సమితి నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్: ప్రొద్దుటూరు మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున తెలిపారు. ఆదివారం స్థానిక మున్సిపల్ గాంధీ పార్కులో సద్భావన సేవా సమితి, మన ప్రజా సేవా సమితి ఆధ్వర్యంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మురికి కాలువల్లో చెత్త వేయడం ద్వారా మురికి నీరు పోక దోమలు వృద్ధి చెందుతున్నాయన్నారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందించాలని కోరారు. సాయంత్రం గాంధీ రోడ్డులో మున్సిపల్ బండి వస్తుందని చెత్తను అందులో వేసి సహకరించాలని తెలిపారు. కుక్కల బెడద నివారణకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో మన ప్రజా సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎండీ అయూబ్‌ఖాన్, సద్భావన సేవా సమితి గౌరవాధ్యక్షుడు పుల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అల్లాబకాష్, ఉపాధ్యక్షుడు లక్ష్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు, సహాయ కార్యదర్శి చంద్రశేఖర్, కింగ్ బాషా తదితరులు పాల్గొన్నారు.

భట్రాజు సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



నూతన అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌రాజు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సరస్వతి విద్యామందిరంలో ఆదివారం ప్రొద్దుటూరు డివిజన్ భట్రాజు సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. అధ్యక్షుడిగా డాక్టర్ పాలగిరి రమేష్‌రాజు, ఉపాధ్యక్షుడిగా రామచంద్రరాజు, సెక్రటరీగా శంకర్‌రాజు, ట్రెజరర్‌గా రమేష్‌రాజు, గౌరవాధ్యక్షులుగా రమణరాజు, శంకర్‌రాజు, ఉపాధ్యక్షులుగా సుధాకర్ రాజు, వెంకటేశ్వరరాజు, గౌరవ సలహాదారులుగా శివప్రసాద్ రాజు, బాలమునిరాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భట్రాజుల సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు.

దస్తగిరమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలి



బద్వేలు : మాట్లాడుతున్న ఆవాజ్ జిల్లా అధ్యక్షులు చాంద్‌బాషా



అట్లూరు: మాట్లాడుతున్న రైతు నాయకుడు రమణ

బద్వేలు అర్బన్ : ప్రేమోన్మాది చేతిలో హత్యకు గురైన దస్తగిరమ్మ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆవాజ్ జిల్లా అధ్యక్షులు పి.చాంద్‌బాషా డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆవాజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఇక మీదట మహిళలు, విద్యార్థినులపై దాడులు జరగకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో ఆవాజ్ ఉపాధ్యక్షులు దావూద్‌బాషా, కె.బి.రసూల్, పట్టణ నాయకులు ఎస్.ఎం.బాషా, మహబూబ్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

అట్లూరు : గోపవరం మండలం సెంచురీ పానెల్స్ సమీపంలోని అటవీ ప్రాంతంలో శనివారం విద్యార్థినిని నిప్పంటించి హత్యాయత్నానికి పాల్పడిన విఘ్నేష్‌పై సంబంధిత అధికారులు కఠినచర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఇ.రమణ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రమైన అట్లూరు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బద్వేలు పట్టణంలోని రామాంజనేయనగర్‌కు చెందిన ఇంటర్ విద్యార్థినిపై పెట్రోలు పోసి నిప్పంటించి పరారైన నిందితుడు విఘ్నేష్‌కు కఠిన శిక్ష పడేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ఇటువంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు దుర్గమ్మ, సుభద్ర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

భవిషత్ ప్రణాళికతోనే విజయం సాధ్యం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి భవిషత్ ప్రణాళికతోనే చక్కటి ఫలితాలను సాధిస్తారని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎంవీ రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కడప అక్కాయపల్లెలోని సాయిబాబా విద్యాసంస్థలో పదవ తరగతి చదివే విద్యార్థులకు, వారి తల్లితండ్రులకు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపైన కూడా ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. ఆరోగ్యంగా ఉంటేనే దేనినైనా సాధించగలరన్నారు. మంచి ఆరోగ్యం కోసం క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస ప్రేరకులు పోకల సుబ్బారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఒత్తిడిని జయిస్తే విజయాన్ని సులభంగా సాధిస్తారన్నారు. విద్యార్థులు మానసిక ప్రశాంతతతో ఉంటూ ఏకాగ్రతతో చదివి పరీక్షలను రాస్తే విజయం వరిస్తుందన్నారు. కడప 46వ డివిజన్ కార్పొరేటర్ యంవీ శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులకు సమయపాలన చాలా ముఖ్యం అన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ యంవి సాయిసుధీర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులందరిని ఒక ప్రణాళికా బద్ధంగా చదివిస్తున్నామని, తప్పనిసరిగా మంచి ఫలితాలను తీసుకోస్తామన్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ సుబ్బరాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లితండ్రులు పాల్గొన్నారు.

రేపు వినికిడి లోపం వారికి ఉచిత మెడికల్ క్యాంప్

కడప రూరల్: వినికిడి లోపం సమస్యల గల వారికి మంగళవారం ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ ఉమామహేశ్వరకుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 0–19 సంవత్సరాలు కలిగిన వారికి దీన్‌దయాల్ శ్రవణా ఫౌండేషన్ అండ్ ఎన్‌హెచ్ఎం, ఎన్‌పీపీసీడీ, ఆర్‌బీఎస్‌కే సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెడికల్ క్యాంప్‌ను కడపలోని డీఈఐసీ రిమ్స్‌లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్యాంపునకు వచ్చే వారు తమ వెంట ఆధార్, రేషన్ కార్డుతో పాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఈఎన్‌టీ వైద్యుల ప్రిస్క్రిప్షన్ , ప్యూర్‌టోన్ ఆడియో మీటర్ రిపోర్ట్‌ను తీసుకురావాలని పేర్కొన్నారు.

28న అగ్రిగోల్డ్ మహా విజ్ఞాపన దీక్ష

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 28న అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా విజ్ఞాపన దీక్షను జయప్రదం చేయాలని అసోసియేషన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి బివి చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్రిగోల్డ్‌లో ఉన్నటువంటి సుమారు పదిన్నర లక్షల కుటుంబాలకు ఇంకా రూ. 3080 కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. అగ్రిగోల్డ్ సమస్యను పరిష్కరించుటలో సమర్థ అధికారులతో స్పెషల్ పర్పస్ వెహికల్ ఏర్పాటు చేయించి సత్వర పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

ఘనంగా గ్యార్మి పండుగ



దుప్పట్లను అందిస్తున్న షేక్‌ఖాదర్‌వలి

ప్రొద్దుటూరు: స్థానిక మట్టి మసీదు వీధిలో దస్తుమియా అండ్ సన్స్ షేక్‌ఖాదర్‌వలి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా గ్యార్మి (జెండా) పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ప్రజలకు మున్సిపల్ ఇన్‌చార్జి మాజీ చైర్మన్ వీఎస్ ముక్తియార్, షేక్ ఖాదర్‌వలి దుప్పట్లు పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమంలో వారు పాల్గొని ప్రజలకు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో ఆల్ ఆఫ్‌యూ దివ్యాంగుల సొసైటీ కన్వీనర్ అఫ్జల్, చలపతిరావు, రషీద్, ఖాజామైనుద్దీన్, సంజీవ్ కుమార్, డిస్కో రమణయ్య, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

ప్రొద్దుటూరు క్రైం: స్థానిక లక్ష్య కార్డియాక్, కంటి ఆస్పత్రిలో ఆదివారం పేదల ప్రజల కోసం నిర్వహించిన ఉచిత గుండె, కంటి వైద్య శిబి రం విజయవంతమైంది. డాక్టర్ పాతకోట శ్రీనాథ్‌రెడ్డి 46 మంది రోగులను పరీక్షించి వారిలో 24 మందికి ఉచితంగా ఈసీజీ, 10 మందికి ఉచిత గుండె స్కానింగ్ పరీక్షలు చేశారు. వారికి తగు చికిత్సలు అందించి సూచనలు, సలహాలు ఇచ్చారు. డాక్టర్ హరిత 36 మంది రోగులకు ఉచిత కంటి పరీక్షలు చేసి వారికి చికిత్స అందించి సూచనలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మంచి ఆహారం తీసుకోవాలని, రోజు వ్యాయామం చేయాలని తెలిపారు. పరిశుభ్రతను పాటించి వ్యాధులను దూరం పెట్టాలన్నారు.

ఆసుపత్రిలో వైద్యసిబ్బందిని నియమించండి



మాట్లాడుతున్న పిడుగు మస్తాన్

పోరుమామిళ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ వైద్యశాలలో పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని సీపీఐ ఏరియా కార్యదర్శి పిడుగు మస్తాన్, పట్టణ సహాయ కార్యదర్శి కేశవ డిమాండ్ చేశారు. ఆదివారం వారు మాట్లాడుతూ 12 మంది వైద్యులు ఉండాల్సిన 50 పడకల ఆసుపత్రిలో కేవలం నలుగురు మాత్రమే విధులు నిర్వర్తిస్తుండటం దారుణమన్నారు. నిత్యం 300 మంది రోగులు వస్తున్న ఈ ఆసుపత్రిలో నలుగురు వైద్యులు ఎలా సేవలందించగలరని ప్రశ్నించారు. వైద్య సేవలందించడం మరిచిపోయి బాతాఖానీలకు పరిమిత మవుతున్నారని ఆరోపించారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదన్నారు. నాలుగు మండలాల ప్రజలకు వైద్య సేవలందించేందుకు నిర్మించిన ఈ ఆసుపత్రిని అందుకు అనుగుణంగా నడపడంలేదని తెలియజేశారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక జీవనజ్యోతి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థిని ఎస్‌కే ఆఫియా అండర్ –17 ఎస్జీఎఫ్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల కడపలో జరిగిన జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ కనపరచి మంగళవారం హిందూపురంలో జరుగనున్న రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైందని కరస్పాండెంట్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఈ విద్యార్థిని కరస్పాండెంట్, ప్రధానోపాధ్యాయుడు కిరణ్ కుమార్, పీఈటీలు, ఉపాధ్యాయులు అభినందించారు.